ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 21 | మార్చి | 2024
పేజీలు 7

## ఓటరుకు భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్



-సిపి సునీల్ దత్

-ఖమ్మం కమిషనరేట్‌లో కేంద్ర బలగాల పోలీస్ కవాతు

3 లో

# మద్యం నియంత్రణ ఎలా..?



(ఫైల్)

-విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు
-బెల్ట్ షాపుల్లో కాపుసారా విక్రయాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కుండమూయ మూకుడు ఉంటుంది కానీ నోరుమూయ ఏముంటుందన్నది పాత సామెత. బారుషాపులు మూయవచ్చు కానీ బెల్ట్‌షాపులు మూయడం ఎలా అన్నది ఇప్పుడు అధికారులకు అంతు చిక్కడం లేదు. లైసెన్స్ మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించి సమస్త సమాచారం అధికార యంత్రాంగం వద్ద ఉంటుంది కాబట్టి వాటిని నియంత్రించడం చాలా తేలిక. సమయపాలన, మద్యం నాణ్యత, ధరలు తదితర విషయాలను

మిగతా 2లో..

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ విపి గౌతమ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ విపి గౌతమ్ ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మద్దులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పొన్నెకల్ కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

మిగతా 2లో..

# రైతుల దరిచేరని పథకం..!




- గోదాముల్లో పంట నిల్వ చేసుకుంటే రూ.2 లక్షల రైతుబంధు రుణం
- రైతుల్లో అవగాహన కరువు
- ఆ దిశగా అడుగులేయని మార్కెటింగ్ శాఖ
- నీరుగారిపోతున్న పథకం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పథకం (రైతుబంధు) రైతుల దరిచేరడం లేదు. దీంతో ప్రభుత్వం నుండి అందే రైతు బంధు అందని పరిస్థితి ఏర్పడింది. రైతులు పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనప్పుడు వ్యవసాయ మార్కెంటింగ్ గోదాముల్లో ఆ పంటను నిల్వ చేసుకునేందుకు వీలుంటుంది. గోదాముల్లో ఉంచిన పంటపై సదరు రైతు రుణం పొందే అవకాశం ఉంది. ఈ పథకాన్ని సుమారు 20 ఏళ్ల క్రితమే ప్రభుత్వాలు అందుబాటులోనికి తెచ్చినప్పటికీ రైతులకు అవగాహన లేకపోవడంతో ఆచరణకు నోచుకోవవడం లేదు. వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారులు ఆ దిశగా అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నట్లు

మిగతా 2లో..

# అటూ.. ఇటూ.. ఎటు..?

-గందరగోళంలో తెలంగాణ టిడిపి
-శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు
-బిజెపితోనే దోస్తానా...?



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ తెలుగుదేశం పార్టీ చౌరస్తాలో నిలబడింది. పోగా పోగా మిగిలిన పార్టీ ఏవైపుకు నిలవాలో అర్థం కానీ స్థితిలో ఉంది. శాసనసభ ఎన్నికల్లో ఏం ఆశించకుండానే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన టిడిపి ఇప్పుడు ఆంధ్రాలో బిజెపి, జనసేన లతో కలిపి ఫ్రంట్ కట్టింది. ఎలాగైనా ఈసారి ఆంధ్రాలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుంది. అక్కడ గెలుపోటముల సంగతి అక్కడి ప్రజలకు వదిలేస్తే ఇక్కడ బిజెపి, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సర్వశక్తులు ఒడ్డుతుంది. మోడీ, అమిత్‌షా తెలంగాణ చుట్టూ తిరుగుతున్నారు. ఎలాగైనా బిఆర్‌ఎస్‌ను మట్టి కరిపించి కాంగ్రెస్ తర్వాత బిజెపి నే అనే భావనను ప్రజల్లో కల్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణ లోను బిజెపి, టిడిపి దోస్తీ కొనసాగుతుందా లేదా అన్న సందేహం వ్యక్తమవుతుంది. తెలంగాణలోను బిజెపి, టిడిపి లు మిత్రులుగా కొనసాగితే కాంగ్రెస్‌కు కొంత మేర నష్టమే. గత శాసనసభ ఎన్నికల్లో చాలా నియోజక వర్గాల్లో కాంగ్రెస్ గెలుపుకు టిడిపి దోహదపడింది అనడంలో సందేహం లేదు. దాదాపు 40 నియోజక వర్గాల్లో ఐదువేలకు పైబడి టిడిపి ఓట్లు ఉన్నట్లు అంచనా. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు వెళ్లి వైసిపి, టిడిపి కూటమిని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభావం కూడా తెలంగాణ టిడిపిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. శాసన సభ ఎన్నికల సమయంలో పోటీపై నాన్చి నాన్చి చివరకు పోటీ లేదని చెప్పడంతో రాష్ట్ర అధ్యక్షుడే పార్టీ జంప్ అయ్యాడు. ఇప్పుడు చెవేళ్ల బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి అయ్యాడు. చంద్రబాబు పాత ధోరణిలోనే ఎటు తేల్చకపోవడమో, సరైన నిర్ణయం అనుకుంటే మరింత బలహీనపడి తెలంగాణలో టిడిపి అదృశ్యం కావచ్చు. గతం మాదిరి కాంగ్రెస్‌కు మద్దతా, బిజెపికి మద్దతా లేక కొన్ని స్థానాల్లో పోటీ చేస్తారా ఏదో ఒకటి నిర్ణయించి గందరగోళానికి తెర దించాలని క్యాడర్ కోరుతుంది. కాంగ్రెస్‌కు మద్దతు అంటే బిజెపికి నష్టం కాబట్టి కమలంతోనే సైకిల్ అన్న భావన క్యాడర్‌లో ఉంది. అంతు చిక్కని నిర్ణయాలకు నెలువైన చంద్రబాబు తెలంగాణలో పార్టీ వైఖరిపై ఏం నిర్ణయం ప్రకటిస్తారో వేచి చూద్దాం.

# మద్యం నియంత్రణ ఎలా..?

(మొదటిపేజీ తరువాయి)
పరిశీలించవచ్చు. కానీ బెల్టుషాపులకు హద్దు పొద్దు రెండు లేవు. వీటికి సమయపాలన అసలే పట్టదు. 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతూనే ఉంటాయి. ఇక ధరల వ్యవహారం వీరికి అసలు పట్టదు. ఎంఆర్‌పిపై రూ. 25 నుంచి రూ. 50ల వరకు అదనంగా విక్రయిస్తుంటారు. ఎన్నికల వేళ అధికారులు మద్యాన్ని నియంత్రించాలని, విచ్చలవిడి విక్రయాల వల్ల శాంతిభద్రతల సమస్యల తలెత్తుందని భావిస్తున్నారు. మద్యం దుకాణదారులకు ఎన్నికల వేళ ప్రత్యేకమైన నిబంధనలు వర్తింపజేయవచ్చు. కానీ మద్యం వ్యాపారులు ఎంఆర్‌పిపై అదనంగా ఐదు నుంచి పది రూపాయలు వసూలు చేస్తూ బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం దుకాణాల్లో దొరకని అనేక బ్రాండ్లు బెల్టుషాపుల్లో లభ్యమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ వైఫల్యమే బెల్టుషాపులు పెరగడానికి, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపట్టడానికి కారణమవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. మద్యం యజమానులు తమ వాహనాల్లో బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అందుకే బెల్టుషాపులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లను తలపించే రీతిలో కొన్ని బెల్టుషాపుల వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల కొన్ని బెల్టుషాపుల్లో కాపుసారా విక్రయాలు కూడా జరుగుతున్నాయి. కల్లూరులో కొన్ని బెల్టుషాపులను తనిఖీ చేసినప్పుడు కాపుసారా బయటపడిందన్న ప్రచారం జరిగింది. ఎక్సైజ్ అధికారులు దీనిని తోసిపుచ్చినప్పటికీ ఆశాఖ వ్యవహార తీరు పలు అనుమానాలకు తావిచ్చింది. జిల్లా ఉన్నతాధికారులు ముందుగా జిల్లాలో ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాల్సి ఉంది. ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయకుండా జిల్లాలో మద్యం నియంత్రణ జరిగే పని కాదన్నది అందరికి తెలిసిందే. ఎన్నికల ముంగిటనైనా ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన ద్వారా మద్యాన్ని నియంత్రించి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి




(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరం ఉన్న చోట రంగులు వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ ఉండాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు సరిపోను ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. భద్రతాపరంగా చర్యలు తీసుకోవాలని, కాంపౌండ్ వాల్ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే కాంపౌండ్ వాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా కాపౌండ్, గోడలపై ఓటరు అవగాహనకు సంబంధించి నినాదాలు వ్రాయించాలన్నారు. భద్రతాపరంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు పాఠశాలను చూడగానే ఇందులో పోలింగ్ కేంద్రం ఉన్నదనే ప్రత్యేకత కనిపించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసి రాజేశ్వరి, పిఆర్ఎస్ఈ చంద్రమౌళి, ఇఇ వెంకటరెడ్డి, విద్యాశాఖ ఇఇ నాగేషు, ఎంపిడిఓ ఎస్. కుమార్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంఈవో శ్యాంసన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల దరిచేరని పథకం..!

తెలుస్తోంది.

**గోదాముల్లో నిల్వ చేసుకుంటే రూ.2 లక్షలు...**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందని పక్షంలో రైతులు వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని రశీదును మార్కెట్ కమిటీలలో అందించాలి. సదరు రైతు నిల్వ చేసిన పంట మొత్తం మీద 75 శాతం రుణాన్ని అందిస్తారు. ఎంత పంటను నిల్వ చేసుకున్నప్పటికీ రైతుబంధు పథకం క్రింద రూ. .2 లక్షలు మాత్రమే రుణాన్ని ఇస్తారు. ఇలా అందించిన రుణాన్ని 180 రోజుల్లో వడ్డీ లేకుండా చెల్లించాలి. రశీదు వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఉన్నందున అధికారులు వారి రుణాన్ని తీసుకున్న తర్వాతే సరుకుని విడుదల చేస్తుంటారు.

**జిల్లాలో ఏ ఒక్కరికీ అందని రైతుబంధు...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ మార్కెట్ రైతుబంధు ఏ ఒక్క రైతు కూడా రెండేళ్లుగా తీసుకోలేదు. ఈ పథకంపై రైతులకు అవగాహన లేకపోవడంతో నీరుగారుతున్నట్లు తెలుస్తోంది. ప్రతీ ఏటా రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పేపర్ ప్రకటనలకే పరిమితమవుతున్నారు తప్ప క్షేత్రస్థాయిల్లో ఆయా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి ప రిధిలో 63 గోదాములు ఉన్నాయి. అత్యధికంగా బూర్గంపాడు మార్కెటి కమిటీ పరిధిలో 12, ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలో 11 గోదాములు ఉన్నాయి. వీటి పరిధిలో వేలాది మంది రైతులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు కూడా రుణం తీసుకోక పోవడం గమనార్హం. గిట్టుబాటు ధర లేకున్నప్పటికీ వచ్చిందే చాలులే అనే ఉద్దేశ్యంతో పంటను తెగనమ్ముకునే అమాయక రైతులున్నారు. వీరికి మేలు చేసేందుకు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ రైతుబంధు పథకం ద్వారా కృషి చేయకపోవడం శోచనీయం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆనుకుని ఉన్న ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ



పథకం క్రింద రైతులకు రూ.5.75 లక్షల రైతుబంధు రుణాలను అక్కడి వ్యవసాయ మార్కెటింగ్ పథకం ద్వారా అందజేశారు. పొరుగు జిల్లాల్లో పథకం అమలువుతున్నప్పటికీ ఇక్కడి అందుకు విరుద్ధంగా ఉంది. కేవలం మార్కెటింగ్ శాఖాధికారుల అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వివవస్తున్నాయి.

**ప్రకటిస్తున్నాం : మహ్మద్ అబ్దుల్ అలీం, మార్కెటింగ్ శాఖాధికారి...**

వ్యవసాయ మార్కెటింగ్ పథకంపై ప్రతీ ఏటా మీడియా ముఖంగా ప్రకటిస్తున్నాం.మార్కెట్ కమిటీల వద్ద వాల్ పోస్టర్లు అంటిస్తున్నాం. రెండేళ్లుగా రైతుబంధు కోసం రైతులెవ్వరూ ముందుకు రాలేదు. అంతకంటే ముందు బూర్గంపాడు, ఇల్లెందు మార్కెట్ కమిటీల్లో రైతులు ఈరకం రుణాన్ని తీసుకున్నారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర లభిస్తున్నందు వల్లే రైతులు గోదాముల్లో పంటలు నిల్వ చేసుకోవడం లేదు. గోదాముల్లో పంటను దాచుకునేందుకు వస్తే వారికి రుణాన్ని ఇచ్చేంది సిద్ధంగా ఉన్నాం.

# ఖురాన్‌తోనే మానసిక ప్రశాంతత




ముక్తి అబ్దుల్ రవూఫ్ ఖాన్

ప్రజాపక్షం/ ఖమ్మం : పవిత్ర గ్రంథం ఖురాన్‌ను చదవడం, నేర్చుకోవడం, ఆచరించడం ద్వారా ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ముక్తి మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మి అన్నారు. ఎప్పుడైతే మనిషి ప్రశాంతంగా ఆలోచించడం మొదలుపెడతాడో అప్పుడు సమాజంలో ఏ సమస్యలు తలెత్తబోవని తద్వారా మానవళి వికాసానికి దోహదం చేస్తుందన్నారు. ఖమ్మం నగర శివారులోని గొల్లగూడెం తాలిముల్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక నవాజ్ ద్వారా తొమ్మిది రోజుల్లోనే ఖురాన్ పఠనం పూర్తి చేశారు. ఈ సందర్భంగా మదర్సాలో జరిగిన ఖత్మే ఖురాన్ వేడుకల్లో ముక్తి రవూఫ్ అలీ ఖాన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. నేటితరం పిల్లలు ఖురాన్‌ను ప్రేమించడం, గౌరవించడం గురించి నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేశారు. మనిషి తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకోవాలంటే విశ్వాసం ఒకటే ఆయుధమని ఖాస్మి తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ అల్లాపై విశ్వసంతో జీవిస్తూ ఇస్లాం ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరికి చేరవేయాలని సూచించారు. పక్కవారి ఆకలి తీర్చమని చెప్పే గొప్ప మానవతను చాటి చెప్పిందే ఇస్లామన్నారు. ముస్లింలను చూసి ఇతరులు ఆచరించేవిధంగా ఉండాలని ఆయన హితవు పలికారు. అంతకు ముందు జరిగిన ఇఫ్తార్ విందుకు నగర నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు.

# మైనర్ బాలికపై అమానుషం

**-గర్భం దాల్చిన బాలిక -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాతనగర్ మండలంలో ఓ మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక గర్భం దాల్చడంతో మండలంలో చర్చనీయాంశమైంది. ఈ నెల 18వ తేదీన పదవ తరగతి పరీక్ష రాయడానికి వచ్చిన బాలిక వాంతులు కావడంతో కళ్ళు తిరిగి కింద పడిపోవడంతో పాఠశాల యజమాన్యం సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి పంపించారు. అంతకు ముందుగా ఈ నెల 15వ వ తేదీన తీవ్ర కడుపునొప్పి రావడంతో ప్రాథమిక హాస్పటల్ కి వెళ్ళగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం వైద్యశాలకు వెళ్లాలని వైద్యులు సూచించారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బాలికను గట్టిగా మందలించగా అసలు విషయం బయటపడింది. తనతో పాటు చదువుకుంటున్న ఓ గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి వల్ల జరిగిందని అసలు విషయం బయటకు తెలిసింది. విషయం బయటకు పొక్కకుండా కొంత మంది పెద్ద మనుషులు బాలిక తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంచాయతీ చేసినట్లు సుజాతనగర్ మండలంలో చర్చ జరుగుతుంది. ఇద్దరూ మైనర్ విద్యార్థిని విద్యార్థులు కావడంతో పాఠశాల దశలోనే ఇలాంటి సంఘటనలు జరగడంతో ఆ నోటా ఈ నోటా విషయం తెలిసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి విద్యార్థులలో ఇలాంటి సంఘటనలు చూడటం దురదృష్టకరమని దీనిపై విద్యాశాఖ ఇలాంటి లైంగిక విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన కల్పించాలని పలు రాజకీయ విశ్లేషకులు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆ మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న సిడిపిఓ సలోమి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, డి సి పి ఓ హరి కుమారి, సోషల్ వర్కర్ భారతి తమ సిబ్బందితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధితుల తల్లిదండ్రులకు మైనర్ విద్యార్థినికి కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్కే జుబేదా బేగం యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దుర్వాసన వెదజల్లుతున్న డ్రైనేజీ

**-ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

ప్రజాపక్షం/ మధిర : మున్సిపల్ కార్మికుల నిర్లక్ష్యం కారణంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని లడక్ బజార్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజ్ నుంచి దుర్వాసన వెదజల్లుతున్న పట్టించుకోవడం లేదని దీనితో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే మురుగు నీటిని తొలగించి కాలువను శుభ్రం చేయాలని కోరుతున్నారు.



# ఓటరుకు భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్

## -సిపి సునీల్ దత్
## - ఖమ్మం కమిషనరేట్‌లో కేంద్ర బలగాల పోలీస్ కవాతు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునేలా భరోసా కల్పించడం కోసమే ఫ్లాగ్‌మార్చ్ (పోలీస్ కవాత్) నిర్వహిస్తున్నామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెంట్రల్ పోలీస్ ఫోర్స్, పారా మిలటరీ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ (పోలీస్ కవాతు)ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ శాంతిభద్రతలకు భంగం కలుగకుండా పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు సిపి తెలిపారు. అందులో భాగంగానే సెంట్రల్ పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీస్ సిబ్బంది కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట మైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం, ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేస్తామని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాకు చెక్‌పెట్టేందుకు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టుల ద్వారా నియంత్రించే చర్యలు చేపట్టినట్లు సిపి తెలిపారు. లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఖమ్మం నగరంతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర, ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో సెంట్రల్ పోలీస్ ఫోర్స్‌తో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు సిపి తెలిపారు. జిల్లా పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నూతన పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బృందాలు బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# జావిద్‌కు కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్‌కు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించాలని రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర అధ్యక్షులు జావిద్‌కు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం మహ్మద్ జావిద్ ఆహర్నిశలు శ్రమించారన్నారు. రఘునాథపాలెం మండలంలో ప్రతి గ్రామం తిరిగి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా రఘునాథపాలెం మండలంలో జావిద్ పాదయాత్ర చేపట్టారని తెలిపారు. రచ్చబండ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో రైతు డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లిన వ్యక్తి మహ్మద్ జావిద్ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు అండగా నిలిచారన్నారు. అటువంటి వ్యక్తికి ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే మహ్మద్ జావిద్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించి రాష్ట్ర స్థాయి పదవిని ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా బాలాజీ, కొంటెముక్కుల నాగేశ్వరరావు, దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, మారం కరుణాకర్‌రెడ్డి, రెంటాల ప్రసాద్, రామ్మూర్తి, తావుర్యా, సిద్దయ్య, పాపయ్య, రామారావు, పాషా, బన్సీలాల్, శ్యాంలాల్, రవి, హరి, వెంకన్న, కృష్ణప్రసాద్, నవీన్, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఠానునాయక్ వర్ధంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజన జాతికి వన్నె తెచ్చిన నాయకుడు ఠానునాయక్ అని సేవాలాల్ సేన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్, మాజీ కార్పొరేటర్ దరావత్ రామ్మూర్తి నాయక్ తెలిపారు. ఠానునాయక్ 74వ వర్ధంతి సందర్భంగా బుధవారం లకారం ట్యాంకు బండ్ వద్ద గల ఠానునాయక్ విగ్రహానికి కిషన్ నాయక్, రామ్మూర్తి నాయక్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, భూమి కోసం, భూక్తి కోసం పోరాడిన వీరుడు, గిరిజన జాతికి వన్నె తెచ్చిన నాయకుడు ఠానునాయక్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం గిరిజనులంతా కలిసి కట్టుగా పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వీరునాయక్, జిల్లా అధ్యక్షులు బి. మంగ్యానాయక్, ప్రధాన కార్యదర్శి పాపాలాల్ నాయక్, కోశాధికారి శ్యాం నాయక్, గోవింద్ నాయక్, సురేష్ నాయక్, తారాభాయి, అశోక్ నాయక్, కిషన్ నాయక్, నెహ్రూ నాయక్, రాజు నాయక్, రవి రాథోడ్, కోటేశ్వరరావు నాయక్, మోతీలాల్ నాయక్, వీరన్న నాయక్, కమల్‌సింగ్ నాయక్, రాందాస్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాయల నాగేశ్వరరావుకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా నామినేట్ అయిన రాయల నాగేశ్వరరావు ను డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ , డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సన్మానించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావును డిసిసి అధ్యక్షులు దుర్గాప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పువ్వాళ్ల మాట్లాడుతూ కష్టపడి పనిచేసే వారికి పదవులు తప్పకుండా వస్తాయని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఖమ్మంజిల్లాపై మంచి అభిప్రాయంతో ఉందని ఖమ్మంజిల్లాకు పదవులు కేటాయించడంలో ముందున్నారన్నారు. రాయల నాగేశ్వరరావుకు గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ పదవిని అప్పగించడం ఎంతో హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్, పాలకుర్తి నాగేశ్వరరావు, మారం కరుణాకర్‌రెడ్డి, సామినేని సురేష్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# బాలరాజు మృతికి పోలీసుల నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 2013 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఇస్లావత్ బాలరాజు ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. బాలరాజు మృతికి పలువురు పోలీసులు నివాళులర్పించారు. బాలరాజు మృతదేహాన్ని మృతుని స్వగ్రామం తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తండాకు తరలించారు. బాలరాజు భౌతికాయాన్ని పోలీస్ అధికారులు ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, పోలీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, తోటి సిబ్బంది సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శాఖపరంగా అందాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా తగు చర్యలు తీసుకుంటామని కుటుంబానికి హామీ ఇచ్చారు.

# చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫోర్ విలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. బుధవారం ట్రంకు రోడ్డులో ఆర్‌జెసి కళాశాల సమీపంలో ఫోర్ విలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాదాచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలను చేపడుతున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, కేసగాని రవి, పొన్నూరు లక్ష్మ ణ్, కెవి చారి, బుజ్జి, భాస్కర్, ఇబ్రహీం, ఎస్‌కె పాషా తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

## -చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ మధుసూదన్




**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండలంలోని జిల్లా సరిహద్దు అయిన పైనంపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం అడిషనల్‌కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..పటిష్ట నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని అన్నారు. నగదు,మద్యం రవాణాను నియంత్రించాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ,ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. వాహనల తనిఖీకి సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతిచెక్ పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ 24గంటలు పటిష్ట నిఘా పెట్టాలని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహశీల్దార్, పంచాయతీరాజ్ ఏఈ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మండలంలోని పెద్దతండా నుంచి వరంగల్‌క్రాస్‌రోడ్డులోని పోలీస్‌స్టేషన్‌వరకు ఖమ్మంసూర్యాపేట రహదారిపై స్థానిక పోలీసులు,పారమిలిటరి బలగాలు ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరుపుకునేలా ప్రజలకు మేమున్నామంటూ భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైని ఐపిఎస్ పోరిక మౌనిక, సిఐ రాజిరెడ్డి, ఎస్ఐలు రామారావు, కుసుమ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు



**ప్రజాపక్షం/పినపాక:** వేసవిలో అడవులకు నిప్పు పెట్టవద్దని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పినపాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని హెచ్చరించారు. బుధవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల అటవీశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. అటవీ ప్రాంతాలలో నిప్పు పెట్టడం వల్ల మొక్కలు చనిపోవడంతో పాటు అడవి జంతువులకు తీవ్ర హాని జరుగుతుందన్నారు. అడవులలో సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు అని తెలియజేశారు. అడవి జంతువులను వేటాడటం సైతం నేరం అన్నారు. అటవీ శాఖ అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. అటవీ భూములను గుర్తించి ఇప్పటికీ నర్సరీలు పెంచుతున్నామని తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ 10వ డివిజన్ సుందరయ్య నగర్ అంగన్ వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కోటేశ్వరి పాల్గొని గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం గురించి వివరించారు. తల్లి, పిల్లల బరువు, ఎత్తులు, సమతుల ఆహారం గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో రాజేశ్వరి, ఏఎన్ఎం అమృత, అంగన్‌వాడీ టీచర్లు డి. విజయలక్ష్మి, జి. నాగమణి, ఆశా కార్యకర్త విజయలక్ష్మి, ఆయా సంపూర్ణ, తల్లులు, చిన్నారులు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీ గ్రామాల్లో పౌష్టికాహారం అందించండి

## ఎర్రగుంట వలస ఆదివాసి గ్రామంలో పర్యటించిన ఎంపీఓ



**ప్రజాపక్షం/పినపాక:** వలస ఆదివాసి గ్రామాలలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పినపాక మండలం ఉప్పాక గ్రామపంచాయతీ ఎర్రగుంట వలస ఆదివాసి గ్రామంలో స్థానిక సెక్రటరీ అరుణ శ్రీతో కలిసి పర్యటించి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. వలస ఆదివాసి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అక్కడ గల అంగన్‌వాడి పాఠశాలను సందర్శించి, ఆ అంగన్‌వాడి పాఠశాల ఉప్పాక పంచాయతీ పరిధిలో ఉండటంతో అక్కడ బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో బాలామృతం, పాలు, గుడ్లు తెప్పించి వారికి అందించారు. గ్రామానికి చాలా దూరంలో ఉంటూ వలస ఆదివాసులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. అక్కడ ఉన్న మూడు పంపులు సైతం పాడయిపోయి నిరుపయోగంగా ఉన్నాయని వారికి తాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ సమస్యపై అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానన్నారు. అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. గ్రామంలో వెంటనే బ్లీచింగ్ పనులు చేపట్టారన్నారు. ఇంత వరకు తమ గ్రామాలకు వచ్చిన అధికారి లేదని తమ సమస్యలు వినే నాధుడే లేదని వచ్చిన అధికారికి ఆదివాసీలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అంగన్‌వా టీచర్ చంద్రకళ, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు ముడివి రమేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యూ) ఖమ్మంజిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ లక్ష్మి లు తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో పివోడబ్ల్యూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత పదేళ్లుగా మతోన్మాద, ఫాసిస్టు విధానాలను అనుసరిస్తుందన్నారు. ప్రజలపై, మేధావులపై, మైనార్టీ వర్గాలపై దాడులు నిర్వహిస్తుందన్నారు. 2016లో బేటీ బచావో బేటీ పడావో అని మోడీ చేసిన నినాదాలు చాలా అద్భుతంగా ఉన్నప్పటికీ భారత్ వెలిగిపోతుంది నిర్భర భారత్, స్వచ్ఛా భారత్ నినాదాలు ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ పేద ప్రజలకు వరిగింది మాత్రం ఏమి లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు సంపదను దోచి పెడుతుం దన్నారు. మహిళల సంక్షేమం కోసం చట్టాలు ఎన్ని చేసినా రాష్ట్రంలో, దేశంలో మహిళలపై దాడులు, హత్యలు ఆగడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు సాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బానోత్ పద్మ, నాయకులు మేక రేణుకమ్మ, సుగుణమ్మ, వనిత, రమాదేవి, ఎల్లమ్మ, విజయ, సంతోషి, నాగమణి, పద్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని తక్షణమే టెండర్లు పిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తునికాకు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఇతర పేదలకు రెండో పంటగా ఉంటుందని, ఇప్పటికే ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉందని, తునికాకు సేకరణ సీజన్ సమీపిస్తున్నా అటవీ శాఖ అధికారులు టెండర్ల విషయంలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. నిర్లక్ష్యం వీడి వెంటనే టెండర్లు పిలిచి తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మాలోత్ రావూజ, వూకంటి రవికుమార్, గొగ్గెల ఆదినారాయణ, పోడియం వెంకటేశ్వరరావు, నిమ్మల మధు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన దళ సభ్యుడు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా పోలీస్ అధికారుల ఎదుట మావోయిస్టు దళ సభ్యుడు మడవి బుర్ర అలియాస్ కృష్ణ బుధవారం లొంగిపోయాడు. ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం, చర్ల, శబరి ఏరియా కమిటీలో గత 9 సం.లుగా పనిచేస్తున్న బుర్ర మావోయిస్టు పార్టీ ప్రీస్ టీంలో బాధ్యతలు చేపట్టాడు. మావోయిస్టు అగ్రనేతలు హరిభూషణ్, బండి ప్రకాష్, దామోదర్ వంటి నాయకుల వద్ద పనిచేశాడు. పోలీసులు చేపట్టిన ఆపరేషన్ చేయూత కార్యక్రమానికి ఆకర్షితుడైన బుర్ర కొత్తగూడెం పోలీసులు, 141 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ ముందులొంగిపోయాడు. ఈయన స్వగ్రామం జిల్లాలోని చర్ల మండలం ఎర్రపాడు, బుర్రాపై రూ.4 లక్షల రివార్డు కూడా ఉన్నట్లు చెప్పారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళసభ్యులు కుటుంబ సభ్యులు ద్వారా, పోలీసుల ద్వారా లేదా నేరుగా ఉన్నతాధికారుల ముందు లొంగిపోవచ్చని, వారికి ప్రభుత్వం తరుపున పునరావాసం కల్పిస్తామని ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు.

# మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

## కలెక్టర్ విపి గౌతమ్





**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ విపి గౌతమ్ రూరల్ మండలంలో పర్యటించి పెద్దతండా, మద్దులపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలు ఎంత మంది ఉన్నది మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని స్టోర్స్‌ను తనిఖీ చేసి సామాగ్రి నిల్వను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇస్తున్న కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. గుడ్ల బరువును తూకం వేయించారు. అగ్రిమెంట్ ప్రకారం గుడ్ల బరువు ఉండేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. అనంతరం పొన్నెకల్ వద్ద పురోగతిలో ఉన్న ఖమ్మం, సూర్యాపేట హైవే రోడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాల పనులు పూర్తయినట్లు ఒక వైపు రోడ్డు పనులు కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. నెలాఖరుకు రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, రేడియం స్టిక్కర్లు ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా సహాయ కలెక్టర్ యువరాజ్, ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, పిఆర్ఎస్ఈ చంద్రమౌళి, నేషనల్ హైవే ఇఇ యుగంధర్‌రావు, అధికారులు తదితరులు ఉన్నారు.

# డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలి

## నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల సందర్భంగా డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలను కమిషనర్ ఆదర్శ్‌సురభి సందర్శించారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూము ఏర్పాట్లను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ ఏ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనేది సంబంధిత అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల రోజు డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ రోజు ఏర్పాట్లకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, అర్బన్ తహసీల్దార్ స్వామి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

# పండితాపురం జాతరలో మహా అన్నదానం





## -ప్రారంభించిన తుంబూరు దయాకర్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/కామేపల్లి:** పండితాపురంలో జరుగుతున్న జాతర కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి, కారేపల్లి సిఐ తిరుపతిరెడ్డి, కామేపల్లి ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు బోడెపూడి విఠల్‌రావు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్‌లు పాల్గొని వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి కొమ్మినేపల్లి, కొండాయిగూడెం, పండితాపురం భక్త బృందం ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణతో ఆశీర్వదించి సత్కరించారు, కళ్యాణ మహోత్సవం సందర్భంగా జరుగు జాతర కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. బుధవారం అర్ధరాత్రి 12గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం జరగనున్న సందర్భంగా జాతరలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ అడ్వకుట్ బోడెపూడి విఠల్‌రావు తన సొంత ఖర్చులతో వితరణతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వాలంటీర్లుగా పని చేసి ప్రశాంతంగా నడిపించారు. స్వామి వారి కళ్యాణం ప్రశాంతంగా జరుపుకోవాలని ఏసిపి తిరుపతిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి మల్లి బాబు యాదవ్ పర్యవేక్షించి విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ నరసింహ నాయక్, మేకల మల్లికార్జునరావు, మేకపోతుల మహేష్, ధరావత్ అనురాధ, తోటకూరి భద్రయ్య, చల్ల మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాద్, అంబడిపూడి వెంకటేశ్వర్లు, దొడ్ల వేణు, తొండల ముత్తయ్య, బండి లక్ష్మి నర్సు, బండి ఉపేందర్, మేకల లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం



**ప్రజాపక్షం/కల్లూరు:** సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోని త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధంగా ఉన్నట్లు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. తల్లాడ మండలంలో 45,706, కల్లూరు 53, 620, పెనుబల్లి 43,133, సత్తుపల్లి 63,823, వేంసూర్ 36,514, కాగా వీరిలో 1,24,774 మహిళలు ఉన్నారు. పురుషులు 1,18,010 ఓటర్లుగా నమోదయి ఉన్నారు. థర్డ్ జండర్ 12 మంది నమోదయి ఉన్నట్లు ఆర్డిఓ తెలిపారు. అదే విధంగా 18 సంవత్సరాలు నిండి నమోదు కాని యువతీ యువకులు ఉన్నట్లయితే నమోదుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మొత్తం ఓటర్లు 2,42,796 సత్తుపల్లి నియోజకవర్గంలో నమోదయి ఉన్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను ఆయా తహశీల్దారుల వద్ద సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని పంచదార పరిశ్రమ వద్ద ఏర్పాటుచేసిన అంతర్‌రాష్ట్ర చెక్పోస్ట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై షేక్ షాకీర్ తెలిపారు. ప్రతిరోజు 150 వాహనాలు రాకపోకలు నిర్వహిస్తున్నట్లు ద్విచక్రం మూడు చక్రాలు నాలుగు చక్రాలు వాహనాలు ఈ చెక్ పోస్ట్ వద్ద నుంచి రాకపోకలను నిర్వహిస్తున్నట్లు వారు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడి నుంచి ఎక్కడకు ఎవరెవరు వెళ్తున్నారు? ఏమి తీసుకుని వెళ్తున్నారు. తనిఖీ చేసిన తర్వాత ఫోన్ నెంబరు బండి నెంబరు లను నమోదు చేసుకొని పంపిస్తున్నారు. షిఫ్ట్ పద్ధతిలో పలు శాఖల అధికారులు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. నిఘా నేత్రాలు మధ్య పోలీస్, సిఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలు, రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఎన్ ఎస్ పి శాఖ అధికారులు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ఈ చెక్ పోస్ట్ నిర్వహించడం జరుగుతుందని ఎస్ఐ వివరించారు.

# ఓటు నమోదు ఓటు హక్కుపై అవగాహన




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రతిభ డిగ్రీ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ఓటు నమోదు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ తహశీల్దార్ బాబ్జీ ప్రసాద్ నిర్వహించారు. ఓటు వజ్రాయుధం లాంటిదని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొని తమ యొక్క ఓటు ఇష్టమైన వారికి ఓటు వేసి ఎంపిక చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం ఓటు హక్కు అవగాహనపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దామాల ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు వీరరాఘవయ్య, నెహ్రూ యువక కేంద్రం అధికారి అన్వేష్, అకౌంట్స్ ప్రోగ్రాం అధికారి భానుచందర్, యూత్ క్లబ్ అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

**- కలెక్టర్ డా.ప్రియాంక ఆలా**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్త కుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని విసి హాల్ నుండి ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయితీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుముఖం పడుతున్నందున రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందుముందు ఏఏ ప్రాంతాల్లో ఎంతమేరకు నీరు ఉంటుందో చూసుకోవాలన్నారు. బోర్ల మరమత్తులు, ఫ్లషింగ్ పనులు చేయాలని, ప్రైవేటు బావులు, నీటి వనరులు లీజుకు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి సరఫరా పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏఇలు గ్రామాల్లో తిరిగి సమస్యలు పరిష్కరించాలని, లీకేజీలపై దృష్టి పెట్టి పరిశుభ్రమైన నీటిని అందేంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీ పదిహేను రోజులకు ఓ సారి వాటర్ ట్యాంకులు పరిశుభ్రం చేయాలని, ఆ బాధ్యత పంచాయితీ కార్యదర్శులదే అన్నారు. జిల్లాలో 350 ఇంకుడు గుంతలు మంజూరు చేసినప్పటికీ ఆ పనులు నేటికీ పూర్తి కాలేదని, దానిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ విద్యా చందన, మిషన భగీరథ ఇఇ తిరుమలేష్, ఇంచార్జ్ డిపిఓ సుధీర్ కుమార్, అన్ని మండలాల మిషన్ భగీరథ డిఇలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# యడ్లపల్లి సంతోష్‌కి కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వాలి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల కాంగ్రేస్ పార్టీ మండల కార్యాలయంలో యూత్ కాంగ్రేస్ మండల అధ్యక్షులు గుగులోతు హర్షనాయక్ ఓబిసి సెల్ చైర్మన్ బోళ్ళ రమేష్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు సాయి కిరణ్ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రేస్ పార్టీ 100 పరిపాలనలో ప్రజలకు మాట ఇచ్చిన విధంగా ప్రజలకు చేరువలో పరిపాలన తీసుకొచ్చానని అన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, ఇంకా మున్ముందు ఖాళీగా ఉన్న ఉద్యోగులకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని అన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల అమలు చేయడం జరిగిందని అన్నారు. ఏ ప్రభుత్వం ధైర్యం చేయని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క 100 రోజుల్లో పార్టీ కార్యకర్తలకు న్యాయంజరగాలనే ఉద్దేశ్యంతో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్నారని అన్నారు. ఇది పార్టీ కార్యాకర్తలో ఉత్సాహం కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామని, ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్ఎస్‌యుఐ, యూత్ అధ్యక్షులుగా యడ్లపల్లి సంతోష్ పార్టీ కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కేసులు నమోదవుతున్న వెనుక అడుగు వేయకుండా గత పది సంవత్సరాలుగా కొట్టాడిన వ్యక్తి సంతోష్, సంతోష్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మొత్తం అనేక మంది యువకులు, విద్యార్థులు పార్టీ కోసం శ్రమించారన్నారు. జాతీయ కాంగ్రేస్ పిలుపునిచ్చి రాష్ట్ర కాంగ్రేస్ పిలుపునిచ్చినే కార్యక్రమం అయిన అనేక అవహేళనల మధ్య ఆర్థిక ఇబ్బందుల మధ్యం విజయవంతం చేసిన ఘనత జిల్లా యువజన కాంగ్రేస్ గౌరవ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌కి, గౌరవ జిల్లా మంత్రివర్యులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా యువజన కాంగ్రేస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్‌కి పరిపాలనలో కూడా భాగస్వామి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత పది సంవత్సరాల ప్రతిపక్ష కాలంలో జిల్లా మొత్తం మీద ఎన్ఎస్‌యుఐ యూత్ కాంగ్రేస్ పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించింది. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించాలనే మా ప్రయత్నాలు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాకు మద్దతుగా నిలిచినందుకు హృదయపూర్వ ధన్యవాదాలు తెలిపారు. ఈ పత్రికా సమావేశంలో యువజన కాంగ్రేస్ మండల నాయకులు గుగులోతు రాజేష్‌నాయక్, లావుడ్యా రాజ్‌కుమార్, రఘు, ఉపేందర్, సేఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైపు.. మాజీ ఎమ్మెల్యే వర్గం చూపు

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేని మండల కేంద్రంలో ఒక మాజీ శాసన సభ్యులు వర్గం మొత్తం కాంగ్రేస్ వైపు చూస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు చేసిన అనేక అవినీతి పనులు కప్పిపుచ్చుకోవడానికి అధికార పార్టీ వైపు వస్తున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మా కాంగ్రేస్ పార్టీ వారిని చేర్పించుకుంటుందో లేదో వేచిచూడాలి. కొంతమంది కాంగ్రేస్ నాయకులు వారి చేరికను మంత్రిస్థాయిలో రాకుండా అడ్డుకుంటున్నారని, వారు వస్తే కష్టపడ్డవారికి న్యాయం ఓరగదు అని జిల్లా నాయకులు, వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్‌కి విన్నవించుకున్నట్లు సమాచారం. వారరు అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రేస్ పార్టీ నాయకులపై కేసులు పెట్టి కాంగ్రేస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టారని అభివృద్ధి పథకాల్లో కాంగ్రేస్ కార్యకర్తలు రాకుండా చేశారని జిల్లా నాయకులకు వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతి అభివృద్ధి పథకాల్లో డబ్బు ఇచ్చిన వాళ్ళకి పథకాలు ఇచ్చారని, అలాంటి వారికి మన కాంగ్రేస్ పార్టీలో వస్తే ప్రజలకు వేరే సమాచాం వెళుతుందని, మంత్రులుగా, వైరా నియోజకవర్గ శాసనసభ్యులుగా రాందాస్‌నాయక్ వివరించినట్లు సమాచారం. మరి చూడాలని వారిని కాంగ్రేస్ పార్టీ చేర్చుకుంటుందో లేదో చూడాలి.

## పాఠశాలను సందర్శించిన ఎంఇఓ



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలో ఎంపిపిఎస్ కారేపల్లి బిసి కాలనీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుడు పి.రామగోపిపై వివిధ పత్రికల్లో వస్తున్న ఆరోపణలపై స్పందించి పి.రామగోపిపై ఎంక్వైరి వేశారు.

## ప్రత్యేక అధికారుల పాలన ఏది?



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలో ఉన్న 41 గ్రామపంచాయతీలకు ప్రభుత్వం సర్పంచ్‌ల పదవికాలం పూర్తి అవడంతో ప్రత్యేక అధికారులను గ్రామపంచాయతీలకు నియమించింది. కాని సింగరేని మండలంలో ఎప్పుడు అయితే ప్రత్యేక అధికారులను నియమించారో అప్పటి నుండి గ్రామపంచాయతీ పాలన కుంటుపడింది. ఎవరో వస్తారో ఏదో చేస్తారు అని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూశారు. కాని ఏ గ్రామపంచాయతీలో కూడా సమస్యలు పరిష్కారం కాలేదు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎవరు కూడా సమస్య గురించి చెబితే గ్రామపంచాయతీలో డబ్బులు లేవు అని నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు. ప్రతి గ్రామపంచాయతీలో నీటి సదుపాయ సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

# బిఎస్‌సి విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు బిఎస్‌సి వృక్ష, జంతు శాస్త్రం చదువుతున్న విద్యార్థులు బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పూర్వ వరంగల్ జిల్లాలోని చొప్పల గ్రామంలోని దేవర్లగుట్టపై ఉన్న వృక్ష వైవిద్యాన్ని, దామరవాయిలోని 3 వేల సం.బృహత్సుల యుగం నాటి సమాధాలు, రామప్ప చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జాన్ మిల్టిన్ మాట్లాడుతూ ఇలాంటి పర్యటనల వల్ల విద్యార్థుల్లో మరింత ప్రత్యేక్ష అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాం ప్రసాద్, డా.ఎన్ నాగసమీరా, డా.ఏ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్లకు శంకుస్థాపన



ప్రజాపక్షం/చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయం వద్ద నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కోదండ రామాలయ చైర్మన్ నారగని శ్రీనివాసరావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంభం వీరభద్రం, ఆలయ కమిటీ చైర్మన్ బైరు శ్రీరాములు, ముత్తినేని వెంకటేశ్వర్లు, వెచ్చ మంగయ్య, యల్లంపల్లి చిన్నఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనల ప్రకారం సూక్ష్మ పరిశీలన చేయాలి

**- ఎన్నికల అధికారులకు శిక్షణ**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా వ్యయాల నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల అసిస్టెంట్ వ్యయ అధికారులు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎఫ్ఎఫ్‌టి టీంలు ప్రతి రోజు మానిటరింగ్ చేయాలని, ఎన్నికల వ్యయం, ఇతరత్రా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి ఎండి అలీం తదితరులు పాల్గొన్నారు.

# రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదం



**-ఆలోచనలు లేని మాటలు అనర్థం**
**-వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రైతుల గురించి బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని రైతుల గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ నేతలకు లేదని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10 ఏళ్ల కాలంలో రూ.150 కోట్లు మాత్రమే విపత్తుల్లో రైతులకు ఆర్థిక సాయం అందించిన బిఆర్ఎస్ నేతలు రెండు రోజులకే గగ్గోలు పెడుతున్నారని బిఆర్ఎస్ మాదిరి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం వదిలేయదని అకాల వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఒక టివి ఛానల్‌కు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతేడాది తొలి విడతగా రూ. 150 కోట్లు విడుదల చేశారని ఆ తర్వాత రెండుసార్లు ప్రకటించిన అవేవి అమలు కాలేదన్నారు. నాగార్జున సాగర్ నుంచి తొలి పంటకే నీళ్లు ఇవ్వలేని బిఆర్ఎస్ రెండవ పంటకు నీళ్లు ఇవ్వలేదని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుబంధుకు సంబంధించి ప్రతి రైతుకు అందజేస్తామని ఇప్పటికీ మూడు ఎకరాలు ఉన్న రైతులకు అందించామని కొద్ది రోజుల్లోనే ఐదు ఎకరాలు ఉన్న రైతులకు రైతు బంధు అందజేస్తామన్నారు. ఖమ్మం పార్లమెంటుకు సంబంధించి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని మంత్రి తుమ్మల తెలిపారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు తమ వంతు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీతో ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాల జప్తులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకర్లు పెద్ద మొత్తంలో లావాదేవీలు, బల్క్ లావాదేవీలు, ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో డిజిటల్ లావాదేవీల రోజు వారి నివేదిక సమర్పించాలన్నారు. డబ్బు రవాణా విషయమై అన్ని బ్యాంకుల బ్రాంచీలు క్యూ ఆర్ కోడ్ జనరేట్ చేసుకోవాలని ఆయన అన్నారు. ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టిలలో సీజ్ అయిన వాటికి వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలన్నారు. బ్యాంకుల్లో పొలిటికల్ మెసేజ్‌లు, రాజకీయ నాయకుల ఫోటోలు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. పెట్రోల్ పంప్, గోల్డ్ జ్యువెల్లరి యజమానులు రోజు వారి నగదు లావాదేవీలు, ఎంత నగదు, ఎవరి ద్వారా వెళ్తుందో వివరాలు ఇవ్వాలన్నారు ఇప్పటి వరకు జిల్లాలో రూ.169904 విలుల చేసే మద్యం సీజ్ చేసినట్లు 21 బెల్ట్ షాపులను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా సహకార అధికారిణి మురళీధర్‌రావు, అదనపు డిసిపి ప్రసాదరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, సిపివో శ్రీనివాస్, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, బ్యాంకర్లు, ఐటి అధికారులు,జిఎస్టి అధికారులు, పెట్రోల్ పంప్ యజమానులుపాల్గొన్నారు.

# దొండేటి అనసూయమ్మ మృతి

**కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటు**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** యుటిఎఫ్ రాష్ట్ర నాయకుడు దొండేటి రామచంద్రయ్య సతీమణి దొండేటి అనసూయమ్మ (86) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. జీవిత కాలం ఆదర్శ కమ్యూనిస్టుగా అనసూయమ్మ జీవించారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో జననం, మరణం సహజమే కానీ జీవించినంత కాలం ప్రజలకు ఉపయోగపడిన వారు సిద్దాంతాల కోసం పనిచేసిన వారు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తారని అటువంటి కోవకు చెందిన వ్యక్తి అనసూయమ్మ అన్నారు. మొదటి నుండి కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కూడా ప్రజా ఉద్యమాలకు దొండేటి రామచంద్రయ్య, దొండేటి అనసూయమ్మలు ప్రోత్సాహం ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. వారి జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు, సిపిఎం నాయకులు యర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, బండి రమేష్, ప్రముఖ న్యాయవది శరత్, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, తుళ్లూరి నాగేశ్వరరావు, దొండేటి ఆనందరావు, పప్పుల ప్రసాద్, పి. సుధాకర్, ఉపేందర్, సురేష్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ పంచాయితీలో శ్రీ ముసలమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా 7 మండలాల స్థాయి కరకగూడెం, పినపాక, తాడువాయి, మంగపేట, గుండాల, ఆళ్లపల్లి, ఏటూరునాగారం మండలాల క్రీడాకారులకు నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందిస్తాయని అన్నారు. అలాగే క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎర్రం పొట్టయ్య, తోలెం ప్రవీణ్, కొమరం నాగేష్, తోలెం సీతారాములు, తోలెం హరినాథం, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షిప్త సమాచారం...

## వేలం

నిరూపయోగంగా ఉన్న వస్తువులను వేలం వేస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉదయం 10 గంటలకు పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురంలో వేలం పాట జరుగుతుందని ఆయన తెలిపారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఐరన్ స్క్రాప్, కుట్టు మిషన్లు, పాత టైప్ మిషన్లు, ఇతర వస్తువులు వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ ఆధార్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ తీసుకుని ఆర్ఐ అడ్మినిస్ట్రేషన్ రవి (8712682143) సంప్రదించాలని ఆయన తెలిపారు.

## ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో జాబ్ డ్రైవ్

ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో ప్లేస్‌మెంట్స్ సేల్ మరియు టిఎస్‌కెసి ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌డ్రైవ్ నిర్వహించారు. హెటిరో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూలలో 18 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ మహ్మద్ జాకీరుల్లా అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర రెడ్డి, జీవన్‌కుమార్, రమ, సత్యవతి, సాంబశివరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యువత ముందుండాలి

సామాజిక సేవా రంగాల్లో యువత ముందుండాలని సిపిఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు తెలిపారు. డివైఎఫ్ఐ నిర్వహిస్తున్న భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బివికె జనరల్ మేనేజర్ వై. శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ కలెక్టర్ ఇంట్లో చోరీ

ఖమ్మం అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న మధుసూదన్ ఇంట్లో (ఏటూరి నాగారం)లో చోరీ జరిగింది. సిసి పుటేజ్ ఆధారంగా ఇద్దరు వ్యక్తులు ఇంట్లో చోరబడినట్లు గుర్తించారు. సిసి పుటేజ్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోస్టుమాస్టర్ చేతి వాటం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మి నగరంకు చెందిన పోస్టు మాస్టర్ చేతి వాటాన్ని ప్రదర్శించి దాదాపు రూ.50 వేలకుపైగా కాజేసినట్లు సమాచారం. ఖాతాదారుల ఖాతాల్లో నుంచి వారికి తెలియకుండా నగదు మాయం చేశారు. భద్రాచలం పోస్టల్ ఎస్‌పి సుచేందర్ విచారణ చేపట్టారు. ఖాతాదారుల పాసుపుస్తకాల్లో జమైనట్లుగా చూపి ఖాతాల్లో జమ చేయలేదని ప్రాథమిక సమాచారం.

# ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనుమతి లేకుండా విదేశీయానం అనే వార్తకు అధికారులు స్పందించారు. వైరా మండలం అష్ణగుర్తి పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మధు విద్యాశాఖాధికారుల అనుమతి లేకుండానే విదేశీ పర్యటనకు వెళ్లారు. సాధారణసెలవుపై వెళ్లి తిరిగి విధుల్లో చేరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ప్రజాపక్షం ప్రత్యేక వార్తను ప్రచురించింది. వార్తా కథనం పై అధికారులు విచారణ చేసి మధును విధుల నుంచి తొలగించారు.

# కారేపల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం..?




**ప్రజాపక్షం/కారేపల్లిః** కారేపల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం చేసినట్లు మండలంలో జోరుగా చర్చ జరుగుతుంది. రెండు, మూడు రోజుల్లో సొసైటీ డైరెక్టర్లు ఖమ్మం డిసివోని కలవడానికి వెళ్లనున్నట్లు తెలుస్తుంది. కాగా మండలంలో సొసైటీ డైరెక్టర్లు మొత్తం 13 మంది ఉండగా, పది మంది డైరెక్టర్లు చైర్మన్ పైన అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

# మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పుల్లారావు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బోజడ్ల పుల్లారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అధ్యక్ష, కోశాధికారి స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో అధ్యక్షునిగా బోజడ్ల పుల్లారావు, కోశాధికారిగా కాకాని విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చింతల గోపాల్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి , ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి పదవులకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని గోపాల్ తెలిపారు.

# కామేపల్లి సొసైటీ తాత్కాలిక ఛైర్మన్‌గా వెంకటనర్సమ్మ



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి సొసైటీ తాత్కాలిక ఛైర్మన్‌గా సాతానిగూడెం గ్రామానికి చెందిన దొంగల వెంకటనర్సమ్మను బుధవారం ఎన్నిక చేస్తూ అసిస్టెంట్ రిజిస్టర్ సిహెచ్ రవికుమార్ ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఛైర్మన్‌గా ఉన్న తీర్థాల చిదంబరరావుపై డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గారని, దీంతో వైస్ ఛైర్మన్‌గా ఉన్న కాట్రాల రోశయ్య తాత్కాలిక ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా మళ్ళీ డైరెక్టర్లు రోశయ్యపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గారు. దీంతో మిగిలిన డైరెక్టర్లు మళ్ళీ వైస్ ఛైర్మన్‌ను లాటరీ పద్ధతిలో ఎన్నుకోగా దొంగల వెంకటనర్సమ్మను వైస్ ఛైర్మన్‌తో పాటు తాత్కాలిక ఛైర్మన్‌గా ఎన్నిక చేశారు. 22న ఛైర్మన్‌గా ఎన్నిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.